సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ మండలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



సరుబుజ్జిలి: రొట్టవలసలోనాడు-నేడు పనులు ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి సమానంగా పరుగులు తీయిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. మండలంలోని రొట్టవలస హైస్కూల్‌లో నాడు-నేడు ద్వారా పనులు పూర్తిచేసుకున్న పాఠశాల భవనాలను, అవతరబాద్‌లో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువు మాత్రమేనన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చదువుకున్న ప్రతీ విద్యార్థి అంతర్జాతీయంగా ఖ్యాతి గడించాలనే ధ్యేయంతో సీఎం జగన్ విద్యారంగాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, స్థానిక సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గిడ్డంగులు ప్రారంభం

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిధులతో సరుబుజ్జిలి మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన 10 వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు పాడవ్వకుండా నిల్వలు చేసుకొనేందుకు అవసరమైన చోట్ల ప్రభుత్వం గోదాములు నిర్మాణాలు చేస్తుందన్నారు. తనపాలనలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ నేడు అభివృద్ధి, నీతి కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ కరీముల్లా షేక్‌అమన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల నెరవేరిన వేళ..

ఆమదాలవలస రూరల్: జగనన్న కాలనీల ఏర్పాటుతో పేదల సొంతింటి కళ నెరవేరిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో బొబ్బిలిపేట, తురకపేట గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మించిన గృహాలను, కట్యాచార్యులపేట, హనుమంతుపురం గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించిన ఇంటింటా మంచినీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, మామిడి దమయంతి, పార్టీ నాయకులు గురుగుబెల్లి చంద్రయ్య, మామిడి డిల్లేశ్వరరావు, మెట్ట వసంతరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

బూర్జ: విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ గ్రామంలో రూ.1.79 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ప్రారంభించారు. వైకుంతపురంలో రూ.39 లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలను, వైకుంతపురం గ్రామంలో గురువునాయుడు చెరువులో రిటర్నింగ్ వాల్‌ను, బొడ్లపాడు గ్రామంలో రూ.92 లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలను ప్రారంభించారు. అల్లిపల్లిగూడలో గిరిజనులు పోడు పట్టాలను అందించారు. ఎంపీపీ కర్నేన దీప, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్‌ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు ఏగు అనురాధ, బొడ్డేపల్లి వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: బొబ్బిలిపేటలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం



బూర్జ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సరుబుజ్జిలి: అవతారాబాద్‌లో ఇంటింటికీ కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

క్లుప్తంగా

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: మండల కేంద్రంలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చురుగ్గా నిర్వహిస్తున్నారు. పంచాయతీలో 970 మందికి రిజిస్ట్రేషన్లు చేయగా వచ్చిన మేరకు పత్రాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 700 పంపిణీ చేసినట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. పంచాయతీ కార్యాలయంతోపాటు దేశవానిపేట సచివాలయం పరిధిలో ఉన్న జగనన్న కాలనీ లబ్ధిదారులకు గురువారం రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీలు డేవిడ్, వైశ్యరాజు కేశవరాజు, పంచాయతీ ఈఓ చిన్నారావు, పంచాయతీ వార్డు సభ్యులు గుప్త, కృష్ణప్రసాద్, బీఎల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



శశిభూషణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన రాష్ట్ర రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కరణం శశిభూషణరావు గురువారం పాతపట్నం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిశారు. శశిభూషణరావును ఎమ్మెల్యే సత్కరించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గౌరవిస్తారని ఎమ్మెల్యే అన్నారు. రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందని శశిభూషణరావు తెలిపారు. సీఎం జగన్, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండలంలోని రామకృష్ణపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతీ దేవి, మహాత్మా గాంధీ విగ్రహాలను గ్రామానికి చెందిన ఎస్.హరీష్‌రావు ఏర్పాటు చేశారు. విగ్రహాలను ఏఎంసీ చైర్మన్ సారిపల్లి నిరోష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, సర్పంచ్ సారిపల్లి భారతి తదితరులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఇటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో భక్తి, జాతీయ భావం పెరుగుతుందన్నారు. విగ్రహ దాత హరీష్‌రావును అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సారిపల్లి హరి, బాణాల తవిటినాయుడు, గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ గణిత దినోత్సవం



పై-ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గణిత సూచిక పై-ఆకృతిని విద్యార్థులు ప్రదర్శించారు. గణిత ఉపాధ్యాయులు పూజారి హరి ప్రసన్న, సి.హెచ్.వేణుగోపాల్ అంతర్జాతీయ గణిత దినోత్సవం విశిష్టతను వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట కెజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఎస్ఓ ఎం.అంబిక గురువారం తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ (ఎంఎల్‌టి) కోర్సుల్లో ప్రవేశాలకు 40 సీట్లు చెప్పున్న ఖాళీలు ఉన్నాయన్నారు. 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీలోగా హెచ్‌టీటీపీ.ఏపీకేజీబీవీ.ఏపీ.సీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. నిబంధనలకు లోబడి జిల్లా అధికారులు ఎంపిక చేస్తారని తెలిపారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలుచేయాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ రామ్మోహనరావు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని నరసన్నపేట ఆర్ఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో గురువారం ఎన్నికల కోడ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను ఎంపీడీఓ చూస్తారన్నారు. షెడ్యూల్ వచ్చిన 48 గంటల్లో గ్రామాల్లో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, ఇతర కార్యాలయాల్లో ఉన్న సీఎం, పీఎం ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. షెడ్యూల్ వచ్చిన తరువాత అభివృద్ధి పనులు కొత్తగా చేయకూడదని, ఇప్పటికే ప్రారంభించిన పనులు కొనసాగించవచ్చని తెలిపారు. పంచాయతీలతోపాటు ఇతర స్థానిక సంస్థల్లోనూ.. ఎన్నికలు ముగిసేవరకు ఎటువంటి తీర్మానాలు చేచకూడదన్నారు. నరసన్నపేట, జలుమూరు తహసీల్దార్లు పి.కనకారావు, నాగమ్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాగావళి నదిలో వింత చేప



నాగావళి నదిలో దొరికిన వింత చేప

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామంలోని నాగావళి నదిలో వింత చేప కనిపించింది. గ్రామానికి చెందిన కొర్లాపు చిన్ని కృష్ణ గురువారం నదిలో స్నానం చేస్తుండగా వింత చేప కనిపించింది. ఈ చేపకు పక్షిని పోలిన రెక్కలు ఉన్నాయి. ఈ చేపను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

27 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

కొత్తూరు: మండలంలోని మాతల బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కుద్దిగాం గ్రామానికి చెందిన కరిమి మోహన్‌రావు వద్ద 14, బలగ మోహన్‌రావు వద్ద 13 ఒడిశా మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎస్ఐ చెప్పారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని కొర్లకోట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం యమున అన్నారు. మండలంలో వెదుళ్లవలసలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వారికోత్సవాన్ని హెచ్‌ఎం దాసరి నారాయణరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. వైస్ ఎంపీపీ మానుకొండ ధనలక్ష్మి, లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు అప్పారావు, భూపాల్, లత, రజిని, నారాయణరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో ఉన్న ఆదినారాయణ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో జలుమూరు మండలం జోనంకి గ్రామానికి చెందిన కంచి ఆదినారాయణ(35) గురువారం ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. జలుమూరు మండలం జోనంకి గ్రామానికి చెందిన ఆదినారాయణకు సారవకోట మండలం సత్రాం గ్రామానికి చెందిన రమణమ్మతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా రమణమ్మ కన్నవారింట్లో ఉంటున్నారు. గురువారం సత్రాం గ్రామానికి వెళ్లిన ఆదినారాయణ అలుదు గ్రామం పాఠశాలకు ఎదురుగా ఉన్న స్థలంలో సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆదినారాయణను తొలుత సారవకోట పీహెచ్‌సీకి తీసుకురాగా ప్రథమ చికిత్స అందించి అనంతరం 108 వాహనంలో నరసన్నపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం: రైసు మిల్లు యాజమానులు అప్రమత్తంగా ఉండాలని, మిల్లుల్లో సీసీ కెమెరాలు పెట్టుకోవాలని పాతపట్నం సీఐ నల్లి సాయి సూచించారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో ఉన్న రైసు మిల్లుల యాజమానులతో పాతపట్నం పోలీసు సర్కిల్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల రైస్ మిల్లుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని, అందుకే అప్రమత్తంగా ఉండాలన్నారు. మిల్లులకు కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు పరిశీలన..

పాతపట్నం: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ను నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో వేయనుండడంతో 144 సెక్షన్ అమలు ఉంటుందని తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను సీఐ నల్లి సాయితో కలిసి గురువారం పరిశీలించారు. నమినేషన్ వేసిన అభ్యర్థి వాహనానికి అనుమతి ఉంటుందని, మిగిలిన వాహనాలు, వ్యక్తులు 100 అడుగుల బయట ఉండావల్సి ఉంటుందన్నారు. ఎస్ఐ మహమ్మద్ యాసిన్, మండల సర్వేయర్ రామగణపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

సరుబుజ్జిలి: రైతన్నల సంక్షేమం కోసమే ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేస్తుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని యరగాం-పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ కాలువ గట్టుపై రహదారి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. పురుషోత్తపురం నుంచి చెవ్వాకులపేట బాడవ బ్రిడ్జి వరకు కాలువ గట్టుపై రహదారిని నిర్మించడం జరుగుతుందన్నారు. పురుషోత్తపురం పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, ఉపాధి ఏపీఓ బొత్స పార్వతి తదతరులు పాల్గొన్నారు.

68 మందికి వైద్య పరీక్షలు

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తంగి అమ్మన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది 68 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు వరుణ్‌కుమార్, సురేఖలు రోగులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

పొందూరు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుని కేసులను రాజీ చేసుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న సూచించారు. మండల కేంద్రంలోని కోర్టు హాల్‌లో విలేకరులు, పోలీసులు, బార్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎక్కువ కేసులు రాజీ జరిగేలా పోలీసులు, గ్రామ పెద్దలు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు: మండల కేంద్రంలోని 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం మరమ్మతుల చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కొత్తూరు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. సెల్ టవర్లకు, రైస్ మిల్లులకు కూడా విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

మెళియాపుట్టి: ప్రస్తుతం ఆర్థిక మోసాలు పెరిగిపోయాయని వినియోగదారుల ఫోరం మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రుణాలు ఇస్తామని, ఇన్సురెన్సులు అందిస్తామని, బహుమతులు వచ్చాయని సామాజిక మాధ్యమాల్లో పంపిన ఆన్‌లైన్ లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పావద్దన్నారు. హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు శ్రీరాములు, గోపాలకృష్ణ, రామారావు, బాలరాజు, ఆదినారాయణ, దీనబంధు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

- పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ విజయం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పాతపట్నం కె.ఎస్.ఎం.ప్లాజాలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ నెల రోజుల పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, మళ్లీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయాలని, గ్రామాలభివృద్ధి గతంలో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రతీ కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు మేలు జరిగిందని, ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) మాట్లాడుతూ.. నాయకులందరూ పార్టీ గెలపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజల మధ్యే ఉండాలన్నారు. పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త పేరాడ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు కమిరి రాజేశ్వరరావు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరరావు, ఉర్లాన బాలరాజు, ఎ.వి.సురేష్, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



హిరమండలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- హిరమండలం, కొత్తూరులో చేయూత సంబరాలు



కొత్తూరు: చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: రాష్ట్రంలో మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. హిరమండలం సచివాలయం-3 పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న చేయూత చెక్కుల పంపిణీలో పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేసిందన్నారు. మండలంలోని 3,148 మంది చేయూత లబ్ధిదారులకు సంబంధించి రూ.5.90 కోట్ల చెక్కును అందించారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ పి.నాగమణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్‌లు డి.సుందరమ్మ, వి.చిరంజీవులు, ఎం.చిన్నయ్య, వి.బాలరాజు, యందవ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బి.గంగాధరరావు, వంగపల్లి చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు కృష్ణారావు, నక్క ఆనందరావు, మీసాల రామారావు, శిమ్మ పాపయ్య, టి.తాడు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆర్థిక స్వాలంబనే సీఎం జగన్ లక్ష్యం

కొత్తూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని 6,080 లబ్ధిదారులకు రూ.11.40 కోట్ల చెక్కును గురువారం ఎమ్మెల్యే అందజేశారు. మండలంలో నాలుగు సంవత్సరాల్లో చేయూత లబ్ధిదారులకు రూ.43.60 కోట్లు అందించినట్లు చెప్పారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ సారిపల్లి నిరోష, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యానారాయణ, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, సారిపల్లి హరి, ఎంపీటీసీ సభ్యురాలు గండివలస రత్నాలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుంచాల నూకరాజు, సర్పంచ్ సారిపల్లి భారతి, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పంకజ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎన్ఎం మృతికి సంతాపం



బాలామణి (ఫైల్)

హిరమండలం: మండలంలోని సుభలయ ఆర్ అండ్ఆర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఏఎన్ఎం పల్లపు బాలామణి (80) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు గురువారం సంతాపం తెలిపారు. ఈమె 25 ఏళ్లపాటు ప్రభుత్వ ఏఎన్ఎంగా విధులు నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం మరో 11 ఏళ్లపాటు ప్రజలకు సేవలందించారు. జిల్లాలోనే కాకుండా ఒడిశా ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలకు సేవలందజేశారు. ఈమె భర్త కాంతిరాజు ప్రభుత్వ వైద్యుడిగా ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు.